సాక్షి ఖమ్మం

ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



చట్టాలను అధ్యయనం చేయాలి

న్యాయవాదులు చట్టపరమైన సూత్రాలను లోతుగా అధ్యయనం చేయాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి శివశంకర్‌రావు అన్నారు. 8లో



ఫలితాలపై 'ప్రత్యేక' దృష్టి

పదో తరగతి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 23°

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి పాదానికి, శ్రీస్వామి వారి విగ్రహానికి పంచామృతాభిషేకం చేశారు. శ్రీవారిని, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్య కల్యాణం గావించారు. ఆ తర్వాత శ్రీవారికి పల్లకీ సేవ చేయగా ఏపీ, తెలంగాణా రాష్ట్రాల భక్తులు దర్శించుకుని మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కొత్తూరి జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మంలో వేంకటేశ్వర స్వామి ఆలయం

- రేపు స్థలాలు పరిశీలించనున్న టీటీడీ బృందం

ఖమ్మంఅర్బన్: కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఖమ్మంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యాన నిర్మించనున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వినతితో టీటీడీ సానుకూలంగా స్పందించగా కొద్దిరోజుల క్రితం ఓ బృందం ఇక్కడ సానుకూలతలను పరిశీలించింది. ఆ తర్వాత 15వ డివిజన్ అల్లీపురం పరిధి హైదరాబాద్‌-దేవరపల్లి హైవే వెంట ధంసలాపురంలో సర్వే నంబర్లు 565, 563, 564, 565లో సుమారు 20 ఎకరాల భూమి అనుకూలంగా ఉందని అధికారులు నివేదిక సిద్ధం చేశారు. అంతేకాక అదే గ్రామంలో సర్వే నంబర్ 408లో మరో 20 ఎకరాల భూమి కూడా ఉందని తెలిపారు. ఈ స్థలాలతో పాటు రఘునాథపాలెం బైపాస్‌లో నరసింహులు గుట్ట భూమిని సైతం సోమవారం టీటీడీ బృందం పరిశీలించనుంది. ఆ తర్వాత స్థలాన్ని ఖరారు చేసి వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు.

పీఎం డీడీకేపై ప్రత్యక్ష ప్రసారం



మాట్లాడుతున్న డీఏఓ పుల్లయ్య, పక్కన అధికారులు

వైరా/ఖమ్మంవ్యవసాయం: పీఎం ధన ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించగా.. ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వైరా కేవీకేలో ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పలువురు రైతులతో ప్రధాని మోదీ ప్రత్యక్ష ప్రసారంలో మాట్లాడారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) ధనసరి పుల్లయ్య మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, డీడీకేవైతో లబ్ధిని వివరించారు. అలాగే, వివిధ పంటల్లో తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ సుచరితాదేవి, మధిర, వైరా ఏడీఏలు విజయచంద్ర, కరుణశ్రీ, శాస్త్రవేత్తలు డాక్టర్ పావని, డాక్టర్ వై.చైతన్య, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం మార్కెట్ నుంచి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ అలీం, మార్కెట్ సహాయ కార్యదర్శి వీరాంజనేయులుతో పాటు పలువురు రైతులు ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు.

కాంగిరేసులో..

ఆరేళ్ల తర్వాత సంస్థాగత నియామకాలు

- జిల్లా అధ్యక్షుడి నియామకంపై అభిప్రాయ సేకరణ
- పార్టీ నగర అధ్యక్షుడి ఎంపిక పైనా దృష్టి
- అందరికీ ఆమోదం, పార్టీకి విధేయుడైన వ్యక్తికే పట్టం



జిల్లా కాంగ్రెస్ కార్యాలయం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి రేసు మొదలైంది. పార్టీలో సంస్థాగత మార్పులు చేసి కొత్త అధ్యక్షుడిని నియమించాలని అధిష్టానం నిర్ణయించింది. అలాగే నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవినీ భర్తీ చేయనున్నారు. ఈ రెండు పదవులపై శనివారం ఏఐసీసీ పరిశీలకుడు అభిప్రాయ సేకరణ చేశారు. మొదటి నుంచీ పార్టీని నమ్ముకున్న వారికే డీసీసీ అధ్యక్ష పదవి దక్కుతుందనే ప్రచారం జరుగుతోంది. ఏఐసీసీ పరిశీలకుడు ఈనెల 19వ తేదీ వరకు నియోజకవర్గాల్లో పర్యటించి.. రోజుకో నియోజకవర్గంలోని రెండేసి బ్లాక్‌ల్లో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలతో పాటు దరఖాస్తులు స్వీకరిస్తారు.

ముందు డీసీసీ..

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ మరింత బలపడేలా సంస్థాగతంగా మార్పులకు అధిష్టానం నిర్ణయించింది. ఈమేరకు ప్రాంతాల వారీగా పరిశీలకులను నియమించింది. జిల్లా కాంగ్రెస్‌లోనూ సుదీర్ఘకాలంగా సంస్థాగత మార్పులు జరగలేదు. 2019 ఫిబ్రవరి 7న డీసీసీ అధ్యక్షుడిగా పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం నగర అధ్యక్షుడిగా జావేద్ నియమితులయ్యారు. ఆ తర్వాత కొన్ని జిల్లాల్లో డీసీసీ అధ్యక్షులు మారినా ఇక్కడ ఆరేళ్లుగా వారే కొనసాగుతున్నారు. వీరి ఆధ్వర్యాన పార్టీ కార్యక్రమాలు నిర్వహించడమే కాక పలు ఎన్నికలను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం అధిష్టానం నిర్ణయంతో ఈ రెండు పదవుల భర్తీకి అభిప్రాయ సేకరణ చేస్తుండగా.. త్వరలోనే జిల్లా, మండల కమిటీలు, ఇతర నియామకాలు కూడా చేపట్టనున్నారు.

ఎవరైతే మంచిది?

జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి భర్తీపై ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్ దృష్టి సారించారు. ఈమేరకు ఆశావహుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఇదే క్రమాన శనివారం ఖమ్మంలో పార్టీ ముఖ్యనేతలు, మండల స్థాయి నేతలు, పీసీసీ సభ్యులతో సమావేశమై అభిప్రాయ సేకరణ చేపట్టారు. దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడి 'మీకు ఎందుకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని అనుకుంటున్నారు' అన్న అంశంపై ఆరా తీశారు. దరఖాస్తు చేసుకోని నేతలను ఎవరైతే బాగుంటుందని సలహాలు అడిగారు. అలాగే సాయంత్రం కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో ఖమ్మం నగర అధ్యక్షుడి నియామకంపై చర్చించారు.

నియోజకవర్గాల వారీగా..

జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి నియామకంపై ఖమ్మంలో సమావేశం ముగియగా.. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోనూ అభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ఈనెల 19వ తేదీ వరకు ఒక్కో నియోజకవర్గంలో రోజుకు రెండేసి సమావేశాలు నిర్వహించి డీసీసీ అధ్యక్షుడి నియామకంపై అభిప్రాయాలు సేకరిస్తారు. ఆపై నివేదిక తయారు చేసి అధిష్టానానికి పంపిస్తారు. వీటన్నింటినీ బేరీజు వేసుకుని అధిష్టానం తుది నిర్ణయం తీసుకోనుంది. నివేదికలో మూడు నుంచి నాలుగు పేర్లు ఉంటే మంత్రులు, ఇతర నేతల అభిప్రాయాల ఆధారంగా ఎంపిక చేసే అవకాశముంది.

అర్హతలే గీటురాయి..

డీసీసీ అధ్యక్ష పదవితో పాటు ఇతర పదవులకు తగిన అర్హతలను ఆశావహులు నిరూపించుకోవాల్సి ఉంటుంది. సుదీర్ఘకాలం పాటు పార్టీలో కొనసాగుతూ.. అంకితభావంతో పనిచేసిన వారిని పరిగణనలోకి తీసుకునే అవకాశముందని చెబుతున్నారు. అంతేకాక పార్టీలో చేసిన కార్యక్రమాలు, పార్టీ అభివృద్ధిలో పాత్రను పరిశీలకులకు చెప్పగలిగి ఉండాలి. ఈ అర్హతలతో పాటు సామాజిక పరిస్థితుల ఆధారంగా నియామకాలు చేపట్టనున్నారు. కాంగ్రెస్‌లో సంస్థాగత పదవులను మూడేళ్లకోసారి భర్తీ చేయాల్సి ఉన్నా ఈసారి ఆరేళ్ల సమయం పట్టింది.

జాబితా.. చాంతాడంత

కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో జిల్లా అధ్యక్ష పదవే కాక నగర అధ్యక్ష పదవిని ఆశించే వారి సంఖ్య ఎక్కువగానే ఉందని తెలుస్తోంది. ప్రధానంగా డీసీసీ అధ్యక్ష పదవి కోసం పెద్దసంఖ్యలో దరఖాస్తులు అందాయని సమాచారం. దీంతో వీరిలో అర్హులను గుర్తించేందుకు సమయం పడుతుందని చెబుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్నా పార్టీ కోసం కష్టించిన వారికి గుర్తింపు దక్కలేదనే ఆవేదన కొందరిలో ఉంది. ఓవైపు పూర్తిస్థాయిలో నామినేటెడ్ పదవులు భర్తీ కాకపోవడం.. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా వాయిదా పడినందున నేతలను బుజ్జగించేందుకు పార్టీ పదవుల భర్తీనే మార్గమనే భావనతో అధిష్టానం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

క్షేత్రస్థాయిలో కార్యకర్తల సూచనలు తీసుకుంటాం



ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్‌కు దరఖాస్తులు ఇస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు కాంగ్రెస్ శ్రేణుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏఐసీసీ పరిశీలకులు మహేంద్రన్ తెలిపారు. ఖమ్మంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. పదవుల భర్తీకి అభిప్రాయ సేకరణ చేపట్టడమే కాక నియోజకవర్గాల్లో బ్లాక్‌ల వారీగా సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన సమావేశాల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఆదివారం(12వ తేదీ) ఉదయం ఖమ్మం 60 డివిజన్, 13న ఉదయం రఘునాథపాలెం మండలంలో, మధ్యాహ్నం జిల్లా, నగర అనుబంధ సంఘాల అధ్యక్షులతో ఖమ్మంలో సమావేశం ఉంటుందని తెలిపారు. ఇక 14న ఉదయం పాలేరు నియోజకవర్గంలో ఏ బ్లాక్, మధ్యాహ్నం బీ బ్లాక్, 15న ఉదయం సత్తుపల్లి నియోజవర్గంలోని ఏ బ్లాక్, మధ్యాహ్నం బీ బ్లాక్‌లో, 17న ఉదయం మధిర నియోజకవర్గంలోని ఏ బ్లాక్‌లో, మధ్యాహ్నం బీ బ్లాక్ లో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. 18న ఉదయం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వైద్యులు, మేధావులతో, మధ్యాహ్నం న్యాయవాదులు, ప్రొఫెషనల్స్‌తో సమావేశం నిర్వహించడమే కాక 19న జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా, నగర అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న వారితో ముఖాముఖి సమావేశమవుతామని మహేంద్రన్ వివరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావేద్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయకులు డాక్టర్ పి.శ్రవణ్‌కుమార్‌రెడ్డి, రవళిరెడ్డి, రాజీవ్‌రెడ్డి, చెక్కిలం రాజేశ్వరరావు, నాగండ్ల దీపక్ చౌదరి, బాలసాని లక్ష్మీనారాయణ, కొండబాల కోటేశ్వరరావు, చోటాబాబా, మొక్క శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి
- తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల్లో పర్యటన



తిరుమలాయపాలెం: జోగులపాడులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి : పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో పర్యటించారు. తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు -లకావత్ తండా, జోగులపాడు - తిలావత్ తండా బీటీ రోడ్లకు, జల్లేపల్లి, హైదర్‌సాయిపేట గ్రామాల్లో సీసీ రోడ్ల పనులకు, నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం - ముజ్జుగూడెం బీటీ రోడ్డుకు, పైనంపల్లిలో సీసీ రహదారులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అంతంతగానే ఉన్నా.. సంక్షేమ కార్యక్రమాల అమలును ఆపేది లేదన్నారు. తొమ్మిది నెలల్లోనే 25లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని తెలిపారు. సన్న ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తున్నామని, రూ.22,500కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని వెల్లడించారు. ఇంకా విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. పేదల పక్షపాతి అయిన ఇందిరమ్మ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. నేలకొండపల్లికి చెందిన నాగామృత గ్రూప్‌-2లో ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం సాధించగా ఆమెను అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ యాకోబు, పీఆర్ ఈఈ మహేష్‌బాబు డీఈ వేణుగోపాల్, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, తిరుమలాయపాలెం తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, నాయకులు శాఖమూరి రమేష్, ఆర్.నరేష్‌రెడ్డి, కొడాలి గోవిందరావు, భద్రయ్య, గూడవల్లి రాంబ్రహ్మం, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, వేగినాటి లక్ష్మినర్సయ్య, బెల్లం శ్రీనివాస్, కొప్పుల అశోక్, మంగీలాల్ పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన..

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి చిన్న వెంకటగిరిలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్నాక వరంగల్, సూర్యాపేట జిల్లాల పర్యటనకు బయలుదేరతారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం




అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న తుమ్మల

ఖమ్మం అర్బన్: అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, నాణ్యత పాటించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 42వ డివిజన్‌లో శనివారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం అప్పులు మిగిల్చినా విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందన్నారు. ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. రోడ్ల విస్తరణతోనే ఆయా ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జొహర, కార్పొరేటర్ పాకాలపాటి విజయనిర్మల శేషగిరిరావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

డైనోసార్.. స్టెగోడాన్

- సింగరేణి తవ్వకాల్లో లభించిన అవశేషాలు
- తెలంగాణ గడ్డపై నడయాడిన భారీ జంతువులు
- బిర్లా సైన్స్ సెంటర్‌లో ప్రత్యేక పెవిలియన్‌లో ప్రదర్శన



బిర్లా సైన్స్ సెంటర్‌లో డైనోసార్ ఆకృతి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సృష్టి పరిణామ క్రమంలో భూమిపై మంచుయుగం అంతరించాక రాక్షస బల్లులు (డైనోసార్లు), రాకాసి ఏనుగు(స్టెగోడాన్)ల వంటి భారీ జంతువులు వేర్వేరు కాలాల్లో ఆవిర్భవించాయి. ఈ జంతువులు క్రీస్తు పూర్వం మిలియన్ సంవత్సరాల క్రితమే భూమిపై సంచరించాయి. ఆ కాలంలో జీవించిన స్టెగోడాన్ జాతికి చెందిన ఏనుగులు, రాక్షస బల్లులు ప్రాణహిత-గోదావరి లోయ ప్రాంతంలో ఒకప్పుడు రాజ్యమేలాయి. అందుకు సంబంధించిన అవశేషాలు కొన్నేళ్లుగా వెలుగుచూస్తున్నాయి.

బొగ్గు తవ్వకాల్లో..

గోదావరి-ప్రాణహిత నది పరీవాహకంలో సింగరేణి సంస్థ వందేళ్లకు పైగా బొగ్గును వెలికితీస్తోంది. 2020-21లో పెద్దపల్లి జిల్లా మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గనిలో ఓబీ (మట్టి) తొలగిస్తుండగా భూమి లోపలి పొరల్లో నిక్షిప్తమైన ఐదు ఏనుగు కొమ్ములు లభించాయి. వీటిపై పరిశోధనలు జరిపి, క్రీస్తు పూర్వం 26 వేల నుంచి 23 వేల ఏళ్ల క్రితం భూమిపై సంచరించిన స్టెగోడాన్ జాతికి చెందిన ఏనుగుల అవశేషాలుగా తేల్చారు. ఈ ఏనుగు 13 అడుగుల ఎత్తుతో 13 టన్నుల బరువుతో ఉండేదని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. వీటన్నింటినీ కొత్తగూడెంలోని ఎక్స్‌ప్లోరేషన్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉన్న ఎపిక్ సెంటర్‌లోని మ్యూజియంలో భద్రపర్చారు.

గత ఏప్రిల్‌లో స్టెగోడాన్ అవశేషాలు


మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో 2025 ఏప్రిల్‌లో స్టెగోడాన్ జాతికి చెందిన ఏనుగుల అవశేషాలు లభించాయి. ఈ విషయం దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. దీంతో అప్పటికే సింగరేణి ఆధీనంలో స్టెగోడాన్ ఏనుగుల అవశేషాలపై దృష్టి పడింది. తెలంగాణ గడ్డపై జీవించిన ప్రాచీన జీవజాలానికి సంబంధించిన చరిత్రను ప్రపంచానికి పరిచయం చేసేందుకు సింగరేణి-బిర్లా సైన్స్ సెంటర్లు జత కట్టాయి. అందులో భాగంగా బిర్లా సైన్స్ సెంటర్‌లో సింగరేణి పెవిలియన్ పేరుతో ప్రత్యేక ప్రదర్శనశాల ఏర్పాటుకు నిర్ణయించారు. సింగరేణి తవ్వకాల్లో లభించిన వందలాది పురాతన శిలాజాల్లో 50కి పైగా శిలాజాలను హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో ప్రదర్శనకు పెట్టారు. అందులో స్టెగోడాన్ జాతికి చెందిన ఏనుగు దంతాలు కూడా ఉన్నాయి.

ఈ ప్రాంతంలోనే డైనోసార్లు

సింగరేణి బొగ్గు గనులు విస్తరించిన గోదావరి పరీవాహక ప్రాంతం ఒకప్పుడు భారీ జంతువులకు నెలవుగా ఉండేది. ప్రస్తుతం బిర్లా సైన్స్ ప్లానిటోరియంలోని డైనోసారియంలో కనిపించే డైనోసార్ ఆకృతికి సంబంధించిన అవశేషాలు మంచిర్యాల జిల్లా వేమనపల్లి దగ్గర అడవుల్లో 1974-80 మధ్య లభించాయి. అంతకు ముందు 1960, 70వ దశకాల్లో ఏటూరు నాగారం ఏజెన్సీలో సైతం ప్రాచీనకాలానికి సంబంధించిన జంతుజాలం అవశేషాలు లభించాయి. వీటిని బిర్లా సైన్స్ సెంటర్, ఆర్కియాలజీ మ్యూజియం, వరంగల్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) మ్యూజియం-బండ్లగూడలో భద్రపరిచారు.

13 నుంచి శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్

ఖమ్మంలో పర్యటించిన కలెక్టర్, కమిషనర్



రోడ్ల మరమ్మతులపై సూచనలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగయ్యేలా ఈనెల 13 నుంచి పది రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపడుతున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి బైపాస్ రోడ్, సారథినగర్, ఎఫ్‌సీఐ గోడౌన్ ప్రాంతాల్లో శనివారం కలెక్టర్ పరిశీలించారు. రోడ్లకు ఇరువైపులా, సైడ్ డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలు, మట్టిని తొలగించాలని ఆదేశించారు. అలాగే, పవర్ స్వీపింగ్ యంత్రాల పనితీరును పరిశీలించిన కలెక్టర్ కార్మికులు, జవాన్ల వారీగా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని, ప్రతీ ఉద్యోగి పారిశుద్ధ్య డ్రైవ్‌లో పాల్గొనాలని తెలిపారు. అంతేకాక ప్రధాన రహదారులపై ఎక్కడా గుంతలు లేకుండా మరమ్మతు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, ఉద్యాన అధికారి రాధిక, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

19న రాష్ట్రస్థాయి అండర్-14 చెస్ టోర్నీ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏసీపీ రమణమూర్తి, నిర్వాహకులు

ఖమ్మంఅర్బన్: తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 19న ఖమ్మంలో రాష్ట్రస్థాయి అండర్-14 చెస్ టోర్నీ నిర్వహించనున్నారు. ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగే టోర్నీ పోస్టర్లను శనివారం నగర ఏసీపీ రమణమూర్తి ఆవిష్కరించారు. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు టి.వీరన్న తెలిపారు. వివరాల కోసం 83281 02378, 94913 57631 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వర్కర్లకు రూ.10 వేలు ఇవ్వాలి



మహాసభలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

తల్లాడ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు ప్రతీనెల రూ.10 వేలు గౌరవ వేతనం చెల్లించాలని వర్కర్ల యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. తల్లాడలో మహాదేవ లక్ష్మి, తాళ్లూరి లక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగిన యూనియన్ జిల్లా మహాసభలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని 54వేల మంది వర్కర్లకు నెల నెలా రూ.10వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కోడిగుడ్లతో పాటు నిత్యావసర సరుకులు కూడా ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నరసింహారావు మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి రూ.25 చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదల లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, నాయకులు రావి శివరామకృష్ణ, మల్లేశ్, రాంబాబు, దండు ఆదినారాయణ, మద్దోజు శ్రావణ్, ఓర్సు రమేశ్, దయాకర్, రామారావు, రహీం పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



చంద్రు మృతదేహం

తిరుమలాయపాలెం: మిర్చి తోటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లి ఓ రైతు విద్యుదాఘాతానికి గురై బావిలో పడి మృతిచెందిన ఘటన మండలంలోని పడమటితండాలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన భూక్య చంద్రు (54) మిర్చి తోటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కి గురై పక్కనే ఉన్న వ్యవసాయబావిలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య అచ్చమ్మ కుమారుడు భూక్యా నరేశ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



కూలిన ట్రాన్స్‌ఫార్మర్, స్తంభం

మధిర: పట్టణంలోని శివాలయం రోడ్డులో పోతులూరి వీరబ్రహ్మం గుడి వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభం శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి కూలిపోయాయి. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవటంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు విద్యుత్ శాఖాధికారులకు సమాచారం ఇవ్వటంతో ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

పిచ్చికుక్క దాడిలో గాయాలు

కొణిజర్ల: పిచ్చికుక్క దాడి చేయడంతో ఒకే కుటుంబంలో నలుగురు వ్యక్తులు గాయపడిన ఘటన వైరామున్సిపాలిటీ పరిధి,మండలంలోని జమ్మికోయ బంజరలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ కృష్ణవేణి, ఆమె కూతురు ఉమ ఇంట్లో పనులు చేసుకుంటుండగా పిచ్చికుక్క వారి ఇంటి ఆవరణలోకి వచ్చి గేదె దూడను కరిచి గాయపరిచింది. ఉమ కుక్కను అదిలించడానికి రావడంతో పిచ్చికుక్క అమెపై కూడా దాడి చేసి కరిచింది. ఉమ అరుపులు విని ఇంట్లో నుంచి బయటకు వచ్చిన కుటుంబ సభ్యులపై కూడా పిచ్చికుక్క దాడిచేసింది. స్థానికులు కర్రలు తీసుకుని వెంట పడగా కుక్క పారిపోయింది. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని మున్సిపల్ అధికారులు కుక్కల బెడదను తొలగించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

ఫలితాలపై 'ప్రత్యేక' దృష్టి



ఖమ్మం మోమినాన్ పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

- పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు
- ఉదయం, సాయంత్రం గంట చొప్పున నిర్వహణ
- జిల్లాలో 212 ప్రభుత్వ పాఠశాలలు.. 6,500 మంది విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: విద్యాశాఖపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో పదో తరగతి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు చర్యలు చేపడుతూనే.. ప్రత్యేక తరగతులు కూడా నిర్వహిస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నాలుగు రోజుల నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న వార్షిక పరీక్షలకు ఇప్పటి నుంచే విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేసి, ఆ వెంటనే రివిజన్ ప్రారంభించాలని, తద్వారా ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోని 212 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 6,500 విద్యార్థులు మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు.

ప్రత్యేక తరగతులిలా..

జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉదయం 7.45 నుంచి 8.45 గంటల వరకు, సాయంత్రం 4.15 నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సమయాల్లో విద్యార్థులను చదివించడంతో పాటు వారికి గల సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. తద్వారా ప్రతీ సబ్జెక్టుపైనా పిల్లలకు పట్టు పెరుగుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు



పాఠశాలలో ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో మాకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాం.పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మా వెన్నంటే ఉండి ప్రోత్సహిస్తున్నారు. ప్రత్యేక తరగతుల్లో శ్రద్ధగా చదువుకొని మంచి ఫలితాలు సాధిస్తాం.- యశస్విని, మడుపల్లి, మధిర మండలం

చదువుకునేందుకు అవకాశం



ప్రత్యేక తరగతుల ద్వారా ఎక్కువగా చదువుకునే అవకాశం కలుగుతోంది. ఈసారి స్పెషల్ క్లాసులు కొంత ముందుగానే ప్రారంభించారు. ప్రత్యేక తరగతుల ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది.

-కె.విఘ్నేశ్, మడుపల్లి, మధిర మండలం

స్లిప్ టెస్ట్‌లకు సమయం దొరుకుతోంది



ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండడంతో రివిజన్‌కు చాలా సమయం దొరుకుతుంది. తరగతి గదిలో వచ్చిన సందేహాలు ప్రత్యేక తరగతుల్లో నివృత్తి చేసుకుంటున్నాం. చిన్న చిన్న మాక్ టెస్టులు, స్లిప్పు టెస్టులకు కూడా టైం దొరుకుతోంది. – ఎం.నాగేశ్వరి, జల్లేపల్లి, తిరుమలాయపాలెం మండలం

చట్టాలను అధ్యయనం చేయాలి

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి శివశంకర్‌రావు



మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి శివశంకర్‌రావు

ఖమ్మం లీగల్: న్యాయవాదులు చట్టపరమైన సూత్రాలను లోతుగా అధ్యయనం చేసి, ఆస్తుల బదిలీల్లో జరిగే పొరపాట్లను నివారించేలా కక్షిదారులకు సరైన సలహాలు ఇవ్వాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.శివశంకర్‌రావు అన్నారు. ఐలు జిల్లా, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్ –మార్కింగ్ ఆఫ్ డాక్యుమెంట్స్' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శివశంకర్‌రావు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్ నిబంధనలను న్యాయవాదులంతా తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు కోర్టుల గౌరవాన్ని కాపాడాలని, న్యాయంపై ప్రజలకు నమ్మకం పెంచాలని సూచించారు. రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి వెంపటి అపర్ణ మాట్లాడుతూ డాక్యుమెంట్ల మార్కింగ్‌లో ప్రతీ న్యాయవాది జాగ్రత్తగా ఉండాలని అన్నారు. బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొండపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు యువ న్యాయవాదులకు చట్ట పరిజ్ఞానాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షుడు నవీన్ చైతన్య, సత్తుపల్లి, మధిర బార్ అసోసియేషన్ల అధ్యక్షులు మల్లెపూల వెంకటేశ్వరరావు, బోడెడ్ల పుల్లరావు, ఐలు బాధ్యులు మందడపు శ్రీనివాసరావు, ఏడునూతల శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకట్, గద్దల దిలీప్, మీసాల వెంకటేశ్వర్లు, పాగోలు కిషోర్ పాల్గొన్నారు.

వాలీబాల్, హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక



వాలీబాల్ ఉమ్మడి జిల్లా బాలుర జట్టు

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన వాలీబాల్, హ్యాండ్‌బాల్ బాలబాలికల జట్లను ఎంపికచేశారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం నిర్వహించిన ఎంపిక పోటీలకు 170 మంది వాలీబాల్‌క్రీడాకారులు, వంద మంది హ్యాండ్‌బాల్ క్రీడా కారులు హాజరయ్యారు. ఇక్కడ ఎంపిక చేసిన జట్లు హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని జిల్లాక్రీడల సంఘం కార్యదర్శి ఎండీ మూసాకలీం తెలిపారు. వాలీబాల్ జిల్లా బాలుర జట్టుకు జి.అక్షయ్‌కుమార్, ఎ.గోపినాథ్, వి.నాయుడు, ఈ.అనిల్‌కుమార్, ఎస్.శివకోటి, పి.విష్ణువర్ధన్, బి.కల్యాణ్‌ప్రసాద్, ఎన్.శ్రీహాస్, టి.వినయ్, ఎం.శ్యామ్, ఎండీ అస్లాం, పి. వంశీ, టి.శ్రీరాం, రవి కుమార్, జోషినాథ్, రోహిత్, బాలికల జట్టుకు బి.అంబిక, ఎం.నక్షత్ర, కె.ప్రసన్నకుమారి, జి.నవ్యశ్రీ, ఎ.కీర్తన, విద్యశ్రీ, బి.తనూజ, ఆర్.శ్రావణి, డి.పుష్పలత, అతియా ఫాతిమా, ఎస్.ఉమాలత, వి.బేబికల్యాణి, అస్మిత ఎంపికయ్యారని పేర్కొన్నారు. హ్యాండ్‌బాల్ బాలుర జట్టులో విగ్‌నాగ్‌పక్, తియామాత్, కె.వేణు, ఎస్కే ఇమ్రాన్, ఎం. యశ్వంత్, ఎస్కే జకీరుల్లా, జె.గౌతమ్, ఎం.హర్షిత్, జె.రాంచరణ్, వి.పవన్, జి.లాల్‌కృష్ణ, ఐ.కార్తీక్, ఎండీ అబ్దుల్లా, సీహెచ్ కార్తీక్‌రెడ్డి, ఎం.జనార్దన్, సంతోష్ కుమార్, కె.వంశీ, ఎస్.కార్తీక్ ఎంపికయ్యా రని తెలిపారు. అలాగే, బాలికల జట్టులో ఉషాశ్రీనేహ, టి. భవాని, పి.సింధు, వి.సంధ్య, జె.సౌమ్య, సాబా తబాస్సుమ్,డి.భారతి, కె.సాత్విక, కె.హర్షిణి, సీహెచ్. మాధురి, జె.జ్యోత్స్న, అక్షర, బి. రిషి త, ఎస్.అక్షర, బి.కార్తీకరెడ్డికి స్థానం దక్కిందని వెల్లడించారు.

- జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన జిల్లా అండర్–14 బాలబాలికల కబడ్డీ జట్లను శనివారం ఖమ్మంలో ఎంపిక చేశారు. ఈ పోటీలకు 107 మంది బాలురు, 70 మంది బాలికలు హాజరు కాగా జిల్లా జట్లను సంఘం కార్యదర్శి వై.రామారావు ప్రకటించారు. బాలుర జట్టుకు బి.హర్ష, పి.సంతోష్, ఎ.మనోజ్, కె.యశ్వంత్, ఎ.యశ్వంత్, ఆర్.జేమ్స్, బి.అరుణ్, బి.వెంకటేశ్, ఎల్.కౌశిక్, బి.సరిరాం, కె.నాగర్జున, బి.అంజిబాబు, ఎస్.గోపి, కె.అక్షయ్‌కృష్ణ, పి.బాబు, బాలికల జట్టుకు నాగస్వర్చిత, ఎం.శ్రీజ, కెభవ్యశ్రీ,, కె.ఫరిదా, బి.అనూ, కె.భవాని, జి.సృజన, ఎస్కే సమీనా, డి.దేవిశ్రీ, వి.మోక్షితకృష్ణ, ఎల్.స్పందన, జి.అంకిత ఎంపికయ్యారని తెలిపారు.



ఉమ్మడి జిల్లా ఖో-ఖో బాలికల జట్టు

- కల్లూరు: ఉమ్మడి జిల్లా ఖో–ఖో బాలబాలికల జట్లను కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఎంపిక చేశారు. అండర్–19 విభాగంలో జట్ల ఎంపికకు నిర్వహించిన పోటీలకు బాలురు 130 మంది, బాలికలు 90 హాజరయ్యారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేశామని నిర్వహణ కార్యదర్శి బోడా బీమా, పసుపులేటి వీరరాఘవయ్య, మూసా ఖలీమ్ తెలిపారు. పోటీలను పీఈటీలు, కోచ్‌లు ఎస్.రామారావు, పి.పవన్‌కుమార్, ఎ.కృష్ణప్రసాద్, సైదులు, సమ్మయ్య, కై సర్ పద్మావతి, స్టేడియం ఇన్‌చార్జ్ గౌతమ్‌రెడ్డి, నాగబాబు, మామిడాల వెంకటేశ్వరరావు, గోపాల్‌రావు పర్యవేక్షించారు.

కొనసాగుతున్న టీటీ ర్యాంకింగ్ టోర్నీ



మ్యాచ్‌లో సర్వీస్ చేస్తున్న క్రీడాకారిణి

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న బాలసాని సన్యాసయ్య స్మారక రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీ శనివారం రెండో రోజుకు చేరింది. అండర్-11, 13 బాలికల విభాగంలో జిల్లాకు చెందిన బాలసాని తన్మయి, హార్వికతో పాటు డి.శాన్విక క్వార్టర్ ఫైనల్స్‌కు చేరారు. అండర్-13, 17 బాలుర విభాగంలోనూ జిల్లా క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. ఇక హైదరాబాద్, రంగారెడ్డి, జిల్లాల క్రీడాకారులు సైతం తమ ర్యాంకును నిలుపుకునేందుకు పోటీ పడుతున్నారు. శనివారం రాత్రి 45 – 80 ఏళ్ల కేటగిరీల పోటీలు ప్రారంభమయ్యాయి. కాగా, ఆదివారం రాత్రి ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహిస్తామని టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్ తెలిపారు. అంతేకాకజాతీయస్థాయి టోర్నీలో పాల్గొనే రాష్ట్రజట్లను ఎంపిక చేస్తామని వెల్లడించారు. పోటీల ముగింపు సమావేశానికి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.కె.మహేశ్వరి, సి.నాగేందర్‌రెడ్డి, టెక్నికల్ అఫీషియల్ ఎస్.లక్ష్మీకాంత్, సీనియర్ కోచ్ సోమనాథ్ ఘోష్, మేయర్ పి.నీరజ హాజరవుతారని తెలిపారు.

పంచమి మంచిదని..

ఖమ్మంక్రైం: పంచమి తిథి మంచిదని భావించి, రెండో శనివారం సెలవును సైతం రద్దు చేసుకొని ఎక్సైజ్‌శాఖ నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా మద్యం దుకాణాలకు టెండర్ల కార్యక్రమం కొనసాగించింది. పంచమి మంచిదని వ్యాపారులు భారీగానే దరఖాస్తులు సమర్పించారు. శనివారం ఒక్కరోజే 116 మద్యం దుకాణాలకు గాను 86 దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఇప్పటివరకు 158 దరఖాస్తులకు గాను రూ.4.74 కోట్ల ఆదాయం జిల్లా ఎక్సైజ్ శాఖకు వచ్చింది. సోమవారం నుంచి దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు.

కుక్కలు తరమడంతో ఇంట్లోకి దుప్పి..



ఇంటి ఆవరణలో గాయపడిన చుక్కల దుప్పి

సత్తుపల్లి: చుక్కల దుప్పిని కుక్కలు తరమడంతో అర్బన్‌పార్క్ ఫెన్సింగ్ దూకి ఇంట్లోకి వచ్చిన ఘటన పట్టణంలోని జలగంనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. అర్బన్ పార్కులోకి ప్రవేశించిన కుక్కలు వెంటాడటంతో ఫెన్సింగ్ దూకి ఇళ్లలోకి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.అటవీశాఖ అధికారులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో తాళ్ల సహాయంతో దుప్పిని బంధించి పశువుల ఆస్పత్రికి తరలించారు. గత నెలలో చుక్కల దుప్పిని గాయపరిచిన ఘటన మరువకముందే మరో ఘటన జరగటంతో అటవీశాఖ అధికారుల వైఖరిపై విమర్శలు వస్తున్నాయి. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో రూ.50 లక్షల సింగరేణి నిధులతో చైన్‌లింక్ ఫెన్సింగ్ వేసినా దుప్పులకు రక్షణ లేకపోవడం, అర్బన్ పార్కులోకే వెళ్లికుక్కలు వెంట పడు తున్నాయా..? బయటకు వచ్చినప్పుడు దాడి చేస్తున్నాయా..? అనే విషయంపై అటవీ అధి కారు లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై అటవీశాఖ అధికారులను వివరణ కోసం ప్రయత్నించగా దాటవేశారు.

రోడ్డు ప్రమాదంపై కేసు



సన (ఫైల్)

ముదిగొండ: మండలంలోని బాణాపురం – పెద్దమండవ ప్రధాన రహదారిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంపై శనివారం ముదిగొండ సీఐ మురళి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసల కథనం ప్రకారం.. పెద్దమండవకు చెందిన గొర్రెముచ్చు యోహాన్ కుమారుడు సాయి ద్విచక్రవాహనపై తన చెల్లెలు సన(9), స్నేహితుడు పేరం ప్రవీణ్ (13)ను ఎక్కించుకుని ఖమ్మం వెళ్తున్నాడు. మార్గమధ్యలో బాణాపురం సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా ట్రాక్టర్ వచ్చింది. ఆ లైటింగ్‌కు ద్విచక్రవాహనం అదుపుతప్పి కట్టెలపై పడటంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. గొర్రె ముచ్చు సన, సాయిలను ఖమ్మం తరలిస్తుండగా సన మృతిచెందింది. సాయి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సాయి నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని ప్రవీణ్ తండ్రి బుజ్జిబాబు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముదిగొండ సీఐ మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మం రేంజర్‌పై సస్పెన్షన్ వేటు

- 'సంద్ర' కలప అక్రమంలో ఇప్పటికే ముగ్గురు అధికారుల సస్పెన్షన్
- మహబూబాబాద్ అధికారులపై కొనసాగుతున్న విచారణ

ఖమ్మంవ్యవసాయం: కలప అక్రమ రవాణా వ్యవహారంలో ఖమ్మం అటవీ రేంజ్ అధికారి జి నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సి.సువర్ణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ సిస్టం (ఎన్‌టీపీఎస్) పోర్టల్, నకిలీ ఎన్‌ఓసీల జారీ అంశాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో పాటు, అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి వేటు వేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరిగి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు నాగేశ్వరరావు ఖమ్మం హెడ్ క్వార్టర్స్‌ను వీడరాదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఖమ్మం అటవీ రేంజ్ పరిధిలోని చింతకాని సెక్షన్ నుంచి తుమ్మ కలప మాటున అనుమతి లేని సంద్ర కలపను ఉత్తరాది రాష్ట్రాలకు తరలించిన వ్యవహారం విదితమే. ఈ ఘటనలో చింతకాని సెక్షన్ బీట్ ఆఫీసర్ శ్రీకాంత్, సెక్షన్ అధికారి కవితను సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు తాజాగా ఖమ్మం ఎఫ్‌ఆర్‌ఓ పైనా వేటు వేసింది.

మధిర ఎఫ్‌ఆర్‌ఓకు ఇన్‌చార్జ్ బాధ్యతలు

ఖమ్మం ఎఫ్‌ఆర్‌ఓ నాగేశ్వరరావును సస్పెండ్ చేయగా.. ఆ స్థానంలో మధిర ఎఫ్‌ఆర్‌ఓ బి.శ్రీనివాసరెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సువర్ణ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, డోర్నకల్ సెక్షన్ పరిధిలోని తోడేళ్లగూడెం, మన్నెగూడెం తదితర ప్రాంతాల్లో రెవెన్యూ అసైన్డ్ భూముల్లో సంద్ర కలపను నరికి అక్రమంగా రవాణా చేసినట్లు ఆనవాళ్లు గుర్తించగా, ఈ వ్యవహారంపై విచారణ కొనసాగుతోంది. ఒకటి, రెండు రోజుల్లో మరో ఇద్దరు, ముగ్గురు అటవీ అధికారులపై కూడా వేటు పడే అవకాశం ఉన్నట్లు సమాచారం.

మరికొంత కలప లభ్యం !

అటవీ అధికారుల తనిఖీల్లో మహబూబాబాద్ జిల్లాలో మరికొంత అక్రమ సంద్ర కలప లభ్యమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఆ జిల్లాలోని రెండు ప్రాంతాల్లో రూ. లక్షల విలువైన కలపను గుర్తించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై అటవీ అధికారులు రహస్యంగా విచారణ జరుపుతున్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ఖమ్మంసహకారనగర్: నేలకొండపల్లి మండలం సుర్దేపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ, ప్రస్తుతం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో డిప్యూటేషన్‌పై ఉన్న టి.లక్ష్మణ్‌రావును సస్పెండ్ చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్, డీఈఓ పి.శ్రీజ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. లక్ష్మణ్‌రావు హెడ్‌క్వార్టర్ వదిలి కొణిజర్ల సమీపంలోని బాణసంచా దుకాణానికి వెళ్లి ఇతరులతో కలిసి కొందరిని దూషించి సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్లు కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. విధినిర్వహణలో నిర్లక్ష్యం, శాఖ ప్రతిష్టను భంగపరిచేలా వ్యవహరించినట్లు తేలడంతో లక్ష్మణ్‌రావును సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆస్తి గొడవల్లో ఉద్రిక్తత

తరచూ ఘర్షణపై కార్పొరేటర్ దంపతుల ధర్నా



ఆందోళన చేస్తున్న మంజుల, తదితరులు

ఖమ్మంక్రైం: డోర్నకల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి, ఆయన అనుచరులు తమను బెదిరిస్తున్నారని, ఖమ్మం లో అరాచకం సృష్టిస్తున్నారంటూ అధికార పార్టీ కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల – నరేంద్ర దంపతులు శనివారం రాత్రి ధర్నాకు దిగారు. ఖమ్మం వీడీవోస్ కాలనీకి చెందిన సోదరుల మధ్య ఆస్తి గొడవలు జరుగుతుండగా, తమ్ముడి వైపు డోర్నకల్ వాసి వకాల్తా పుచ్చుకుని అన్నతరపు వారితో ఘర్షణ పడుతున్నారు. కొద్దినెలల క్రితం సదరు సోదరుల తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన తన చావుకు కారణమంటూ కొందరి పేర్లతో లేఖ రాయడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మళ్లీ ఇటీవల వివాదం పెరగడంతో ఇంటి ముందు పోలీస్ పికెట్ ఏర్పాటు చేశా రు. ఈ ఇంటి సమీపానే కార్పొరేటర్ మంజుల కుటుంబం నివసిస్తుండగా ప్రతిరోజు గొడవ ఏమిటని డోర్నకల్ వాసిని అడగడంతో ఆయన బెదిరించినట్లు మా ట్లాడగా మంజుల తన అనుచరులతో ఆందోళనకు దిగారు. సదరు ఇంటిని ఆక్రమించుకున్న వారిని బయటకు పంపాలని రాళ్లు రువ్వడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో టూటౌన్ సీఐ బాలకృష్ణ, సిబ్బందితో చేరుకుని డోర్నకల్ వాసి అనుచరులను స్టేషన్‌కు తరలించారు.

శాంతిభద్రతల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత

ఖమ్మంఅర్బన్: ఖమ్మం వీడీవోస్ కాలనీలో జరిగిన ఘటనపై రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలుచేపట్టాలని సీపీని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ, సామరస్య వాతావరణాన్ని నెలకొల్పడం ప్రభుత్వ బాధ్యత అని వెల్లడించారు. కుటుంబ, వ్యక్తిగత తగాదాలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని సూచించారు

చిత్తు కాగితాలు ఏరుకుంటూ చోరీ

బోనకల్: మండలంలోని రాయన్నపేటలో చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు ఏరుకునే మహిళ చోరీకి పాల్పడడంతో గ్రామస్తులు పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో మహిళను అదుపులోకి తీసుకొని విచారించారు. మధిర మండలం మడుపల్లి గ్రామానికి చెందిన మునగాల మల్లేశ్వరి చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తోంది. శనివారం రాయన్నపేట గ్రామానికి వచ్చి చిత్తు కాగితాలు ఏరుకుంటుండగా యంగల వెంకటేశ్వర్లు ఇంటికి తాళం వేసి ఉండటం గమనించింది. తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి ఇత్తడి, రాగి వస్తువులను బస్తాలో వేసుకొని బయటకు వస్తున్న సమయంలో గ్రామస్తులు పట్టుకొని అప్పగించారని ఎస్‌ఐ పొదిలి వెంకన్న తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.